బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అన్ని విభాగాధిపతులతో సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలు, 2024-25 బడ్జెట్ అంచనాలపై అధికారులతో చర్చించారు. ఈనెల 20వ తేదీ నాటికల్లా ప్రతిపాదనలను పూర్తిచేసేలా అయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఎసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, ఎఇ శిరీష్, ఇఇ మాధవి పాల్గొన్నారు.

అందని పౌష్టికాహారం

- తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇళ్లకే పరిమితమైన ప్రీ స్కూల్ పిల్లలు
- లబ్ధిదారులకు అరకొరగానే టిహెచ్ఆర్
- సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెం గ్రామానికి చెందిన ఎం.సునీత కుమారుడు రామ్ తేజ స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యార్థి. ఈ చిన్నారికి ఈనెలలో ఇవ్వాల్సిన గుడ్లు పాలు, బాలామృతం అందలేదు. ఇలా అనేకమంది లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, ఇతర సరుకులు నెల రోజులుగా అందడం లేదు.

అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 37 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెలరోజులు పైబడి పలు కేంద్రాలు తెరుచుకోవడం లేదు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది. ఓ పక్క సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండగా మరోవైపు పౌష్టికాహారం అందిం చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. సచివాల య సిబ్బంది ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నా మని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో 50 శాతానికి పైగా లబ్ధిదారులకు నేటికీ సరుకులు అందని పరిస్థితి నెలకొంది.

కాకినాడ అర్బన్ లోని ఓ సెంటర్లో పంపిణీ కాకుండా ఉండిపోయిన పాలప్యాకెట్లు, ఇతర సామాగ్రి

37 రోజులుగా సమ్మె

తెలంగాణ రాష్ట్రం కంటే రూ.1000 వేతనం అదనంగా ఇస్తామన్న సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని, అలాగే ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు 38 రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయితే ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలకు పిలిచినా పరిష్కరించాల్సింది పోయి ప్రభుత్వం బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తుంది. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా కేంద్రాలను పగలగొట్టి తెరిపించే ప్రయత్నం చేసింది. చివరకు అంగన్‌వాడీలకు వర్తించని ఎస్మాను సైతం ప్రయోగించింది. అయినా వర్కర్లు, ఆయాలు పట్టు వదలకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మెను విరమింప చేసేందుకు సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం కేంద్రాలను సచివాలయ సిబ్బంది ద్వారా తెరిపిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సెంటర్లను తెరవాల్సి ఉన్నా సచివాలయ సిబ్బంది తెరవడం లేదు. మరోవైపు పౌష్టికాహారం కోసం కేంద్రాల చుట్టూ లబ్ధిదారులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందడం లేదు. గుడ్లు, పాలు, ఇతర సరుకులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రీ స్కూల్ ద్వారా విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన పిల్లలు ఇళ్ళకే పరిమితమవుతున్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) కిట్‌లో ఒక కిలో చోడి పిండి, పావు కిలో చొప్పున బెల్లం, ఖర్జూరం, చిక్కీలు, ఒక కిలో అటుకులు ఇస్తుండగా కేంద్రాల్లో నిలవ ఉండిపోవడం వల్ల కిట్లు పాడవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమ్మెను విరమింప చేసి సకాలంలో పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

పెట్టిన ఇండెంట్లు ఇవీ..

కాకినాడ జిల్లాలో బాలింతలు, గర్భిణీలు 16,390 మంది ఉండగా వీరికి ప్రతినెలా ఒక్కొక్కరికి నెలకు 25 గుడ్లు చొప్పున ఇస్తున్నారు. ఈ నెలలో 1,96,680 గుడ్లు ఇవ్వాలని అధికారులు ఇండెంట్ పెట్టారు. మూడు కిలోలు చొప్పున రైస్ ప్యాకెట్లు 49,170, కిలో కందిపప్పు ప్యాకెట్లు 16,390, ఒక లీటరు ఆయిల్ ప్యాకెట్లు 16390, 81950 లీటర్ల పాలు ఇవ్వాలని ఈనెలలో ఇండెంట్ పెట్టారు. అలాగే ఏడు నెలల నుంచి 36 నెలల మధ్య ఉన్న చిన్నారులు 44,675 మంది ఉండగా వారికి 5,36100 గుడ్లు, 44,675 బాలామృతం, 1,11,688 లీటర్ల పాలు ఇవ్వాలని ఇండెంట్ పెట్టారు.

సరుకులు నేటికీ ఇవ్వలేదు

ప్రతి నెల 10వ తేదీ లోపు పాలు, గుడ్లు, టిహెచ్ఆర్ కిట్, కందిపప్పు, ఆయిల్, బియ్యం అందేవి. ఈ నెలలో ఇంకా ఎవరూ ఇవ్వలేదు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది సరు కులు ఇచ్చినట్లు చెబుతున్నారు. గతనెలలో టిహెచ్ ఆర్ కిట్ ఇవ్వలేదు. ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పూర్తిగా పరిష్కరించి మాకు సరుకులు అందేలా తక్షణమే చర్యలు తీసుకోవాలి.

-మాతా ప్రమీల, గర్భిణి, భీమ్ నగర్, నరసింగపురం, పిఠాపురం మండలం

జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సిపిఎం నాయకులు కెఎస్ శ్రీనివాస్, సత్తిరాజు

మాజీ సిఎం జ్యోతిబసుకు నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

స్వాతంత్ర్య సమర యోధుడు, సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసుకు సిపిఎం నగర కమిటీ ఘనంగా నివాళులర్పించింది. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జ్యోతిబసు 14వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతిబసు చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కెఎస్.శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ లోనే అభ్యుదయ మార్గంలో పయనించి భారత కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నేతగా, కార్మికోద్యమ నేతగా కృషి చేశారని కొనియాడారు. సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యుడుగా, 1977 నుంచి 23 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సేవలు అందించి చరిత్ర సృష్టించారని తెలిపారు. సోషలిజం విశిష్టతను చాటుతూ బెంగాల్‌లో అంతర్జాతీయ సెమినార్ నిర్వహణలో జ్యోతిబసు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. 1996లో ప్రధానమంత్రి ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ నిర్ణయానికి కట్టుబడి తిరస్కరించారన్నారు. 96 ఏళ్ళు జీవించిన జ్యోతిబసు కడవరకు కష్టజీవుల శ్రేయస్సు కోసం తపనపడ్డారని తెలిపారు. మతోన్మాదం వెర్రితలలు వేస్తున్న నేటి తరుణంలో జ్యోతి బసు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబుతోపాటు నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, మరియు విజయ, వసంత, యు.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారాను సంపూర్ణంగా అరికట్టాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవతి

మండలంలో విచ్చలవిడిగా ఉన్న నాటుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపిపి రాజా కోరారు. ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన మండల పరిషత్ పాలకవర్గం సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి తుడుపు చర్యలుగా దాడులు నిర్వహిస్తే సారా ఎక్కడ నిర్మూలన అవుతుందని ప్రశ్నించారు. అవసరమైతే సారా తయారయ్యే పొలాల రైతులపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. ఏటిపట్టు గ్రామాల మీదుగా నడిచే కాకినాడ - తామరాడ బస్సు సర్వీసు పునరుద్ధరించాలని ఎన్నో సమావేశాల్లో విజ్ఞప్తి చేసినా పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే ఈ బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంపిపి సత్యవతి, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందేవిధంగా పార్టీల కతీతంగా ప్రజాప్రతినిధులు అందరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.అశోక్ కుమార్, ఇవిపిఆర్‌డి సంజయ్ కుమార్, పులిమేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న జ్యోతుల

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

ప్రజాశక్తి - గండేపల్లి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని ఎన్‌టి.రాజపురం గ్రామంలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని పరిమి వీర్రాజు అన్నపూర్ణ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహణలో సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాలీబాల్ క్రీడా పోటీల్లో జిల్లా నలు మూలల నుంచి సుమారు 30 టీములు పాల్గొడం అభినందనీయమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్పించడంతోపాటు, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ టోర్నమెంటులో విన్నర్‌గా కానవరం జట్టు, రన్నర్‌గా నరేంద్రపురం, మూడో స్థానంలో ఎన్‌టి.రాజపురం, నాలుగో స్థానంలో సోమవారం జట్లు నిలిచాయి. విజేతలకు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కందుల చిట్టిబాబు, అడబాల ఆంజనేయులు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, కోర్పు సాయితేజ, పాలచర్ల సత్యనారాయణ, సుంకవల్లి రమేష్, కంటిపూడి రామయ్య, చాగంటి వీరవెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించేది లేదు

- ప్రభుత్వ షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీల సమాధానం

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించే వరకూ నిరవధిక సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ ప్రభుత్వం జిఒ నెంబర్ 2ని విడుదల చేసింది. అనంతరం పది రోజుల్లోపు విధులకు హాజరుకావాలని సంబంధిత శాఖ అధికారుల ద్వారా షోకాజ్ నోటీసులను అంగన్‌వాడీలకు అందించింది. ఈ నేపథ్యంలోనే అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానంగా బుధవారం జిల్లాలోని పలు కేంద్రాల్లో అంగన్‌వాడీలు నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయాల్లో అధికారులకు ప్రభుత్వ షోకాజ్ నోటీసులకు లిఖితపూర్వకంగా సమాధానాలను ఇచ్చి వారి నుంచి నకలును తీసుకున్నారు. **కాకినాడ** జిల్లా కేంద్రమైన కాకినాడలో డైరీ ఫామ్ సెంటర్ నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానాన్ని లిఖితపూర్వకంగా..వ్యక్తిగతంగా అందించి, వారి నుంచి నకలును తీసుకున్నారు. ముందుగా సమ్మె శిబిరాన్ని 37వ రోజైన బుధవారం నాడు సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈనెల 12న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన చర్చల్లో తమ వద్ద డబ్బు ఉన్నా వేతనాలను పెంచమని చెప్పడం ద్వారా ప్రభుత్వం తన మొండితనాన్ని నిరూపించుకుందని అన్నారు. ఐదేళ్లకోసారి వేతనాలు పెంచాలనే పాలసీని నిర్ణయించుకున్నామని చర్చలకు వచ్చిన మంత్రులు, అధికారులు చెప్పడం శోచనీయమన్నారు. ఐదేళ్లకోసారి వేతతాన్ని పెంచితే నిత్యావసర సరుకులు, ఇతర ధరలను కూడా ఐదేళ్లకు ఒకసారి పెంచుతారా? అని ప్రశ్నించారు. ఐదేళ్లకు ఒకసారి వేతనాలు పెంచదలిస్తే అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారా అని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు, ఇతర బెనిఫిట్‌లు కూడా అంగన్‌వాడీలకు వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాకినాడ నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జి.రమణమ్మ, రమ, నీరజ, మున్ని, రాజేశ్వరి, బాంధవి, సరోజ, విజయ, రమ తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్లోని సమ్మె శిబిరం నుంచి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకూ అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానాలను లిఖితపూర్వకంగా ఐసిడిఎస్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి దాడి బేబీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను రిజిస్ట్రార్ పోస్టుల ద్వారా, గోడలకు అంటించడం ద్వారా సమాచారం అందించారన్నారు. వీటికి తాము ప్రదర్శనగా వెళ్లి సమాధానాలు అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, ఎపి అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఇ.చంద్రావతి, సిఐటియు నాయకులు క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, టి.నాగమణి, అమలావతి, ఎస్తేరు రాణి, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక సమ్మె శిబిరం నుంచి సెక్టార్ కార్యాలయం వరకూ అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానాలను లిఖితపూర్వకంగా ఐసిడిఎస్ పిఒకు అందచేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, ప్రత్తిపాడు కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఇ.చంద్రావతి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించగ పోగా రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కరించకపోతే సమ్మె మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత, అల్లాడి లక్ష్మి, సిహెచ్ హేమలత, యు.మరియ తదితరులు పాల్గొన్నారు. **కోటనందూరు** సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం రిజిష్టర్ పోస్టులో పంపించిన షోకాజ్ నోటీసులను పోస్ట్‌మెన్ బుధవారం నిరసన శిబిరం వద్ద అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానాన్ని గురువారం ఐసిడిఎస్ కార్యాలయానికి వెళ్లి పిఒకు అందిస్తామని తెలిపారు. ఈ నిరసన శిబిరంలో యూనియన్ నాయకుల ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి షకీలా, భాను, దుర్గభవాని, లలిత కుమారి, శ్రీదివ్య, శ్రీదేవి, కుమారి నాయకత్వం వహించారు. **తాళ్లరేవు** మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రాయుడు సునీతకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు పి.ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు వళ్ల రాజబాబు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె శిబిరం నుంచి సిడిపిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానాలను లిఖితపూర్వకంగా సిడిపిఒ పూర్ణిమకు అందచేశారు. శిబిరం వద్ద జరిగిన కారక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక నిరహారదీక్షకు వెనకాడేది లేదని హెచ్చరించారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మావతి, చంద్రావతి, మండల యూనియన్ నాయకులు సుజాత, రాజేశ్వరి, రత్నం, రామ్ లీలా, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తునిలో సమ్మె శిబిరం వద్ద షోకాజ్ నోటీసులు ఇస్తున్న పోస్ట్‌మెన్

కాకినాడ ఐసిడిఎస్ కార్యాలయం అధికారులకు సమాధాన నోటీసులు అందిస్తున్న అంగన్‌శాడీలు

కార్టూ'నిజం'

చేద్దామంటే ముహూర్తం కుదర్డం లేదయ్యా..!!

పిఠాపురానికి నువ్వా..నేనా..!

- వైసిపిలో తప్పని విభేదాలు..
- టిడిపి, జనసేన పొత్తులో దక్కేది ఎవరికో..
- అయోమయంలో ఆయా పార్టీల శ్రేణులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థుల ఎం పికలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. అధికార వైసిపి అభ్యర్థి విషయంలో అధిష్టానం స్పష్టత ఇచ్చిం ది. అయితే స్థానిక నాయకత్వం అందుకు ససేమిరా అనడంతో ప్రశ్నార్థకంగా మారింది. ఇక ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన పార్టీల మధ్య పొత్తు పొడిచినా..నియోజకవర్గాల కేటాయింపుల్లో నేటికీ ఒక స్పష్టత రావడం లేదు. దీంతో తమ నియోజకవర్గానికి అభ్యర్థి ఎవరనే అయో మయంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రస్తుతం ఎంఎల్‌ఎగా పెండెం దొరబాబు అధికార పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే పార్టీ అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నియోజకవర్గాల అభ్యర్థుల చేర్పులు..మార్పులు విషయంలో ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే సిట్టింగ్ ఎంఎల్ఎ దొరబాబును కాదని, కాకినాడ పార్లమెంటుకు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న వంగా గీతను పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఆమె నియామకంపై నియోజకవర్గ వైసిపిలో ఒక్కసారిగా విభేదాలు భగ్గుమన్నాయి. సిట్టింగ్ ఎంఎల్‌గా ఉన్న పెండెం దొరబాబు

2004లో బిజెపి తరఫున పోటీ చేసి ఎంఎల్‌ఎగా విజయం సాధించారు. తదుపరి 2014లో వైసిపి నుంచి పోటీ చేసి ఓటమిని మూటగట్టుకున్నారు. అయితే 2019లో వైసిపి నుంచి మరోసారి పోటీ చేసి విజయం సాధించారు. రెండు దఫాలు నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఎగా ఉన్న ఆయన మూడోసారి పోటీ చేసి విజయం సాధించి హేట్రిక్ కొట్టాలని సిద్ధపడుతున్నారు. అయితే పార్టీ అధిష్టానం ఆయన ఊహాలకు బ్రేకులు వేసింది. ప్రస్తుతం కాకినాడ పార్లమెంటు నియోజకవర్గానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న వంగా గీతను పిఠాపురం నియోజకవర్గానికి సమన్వయ కర్తగా నియమించింది. దీంతో ఒక్కసారిగా వైసిపిలో విభేదాలు భగ్గుమన్నాయి. పెండం దొరబాబును అభ్యర్థిగా ప్రకటిం చకపోతే స్థానిక నాయకులు పార్టీకి, పదవులకు రాజీనామా చేస్తామని పార్టీ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరుపున పోటీ చేసిన వంగా గీత ఎంఎల్‌ఎగా ఇదే నియోజకవర్గం నుంచి ఎన్నిక య్యారు. ఆ సమయంలో తనకంటూ ప్రత్యేకంగా కేడర్నను ఆమె ఏర్పాటు చేసుకున్నారు. దీంతో నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించిన వెంటనే ఆమె కేడర్ ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. దీంతో సిట్టింగ్ ఎంఎల్ఎ పెండెం దొరబాబు, ఎంపీ వంగా గీత మధ్య ఒక్కసారిగా విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో దొరబాబు పార్టీని వీడి, మరోపార్టీలో చేరతారనే ప్రచారం జోరందుకుంది.

ఇక ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన పార్టీల మధ్య పొత్తులో ఉన్నాయి. ఇక్కడ టిడిపి నుంచి ఎస్‌విఎస్ఎస్.వర్మ, జనసేన పార్టీ నుంచి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ అభ్యర్థిత్వాలను ఆశిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి 2014లో టిడిపి నుంచి వర్మతోపాటు, కైట్ విద్యా సంస్థల అధినేత పోతుల విశ్వం పోటీ పడ్డారు. ఆఖరికి టిడిపి అధిష్టానం విశ్వంకే టిక్కెట్టును కేటాయించింది. దీంతో వర్మ స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీలో నిలిచి సుమారు 50 వేల ఓట్ల ఆధిక్యంతో టిడిపి, వైసిపి అభ్యర్థులను ఓడించారు. వెంటనే ఆయన తిరిగి టిడిపిలో చేరారు. గత ఐదేళ్లుగా అధికార పక్షానికి వ్యతిరేకంగా పోరాటాన్ని సాగిస్తున్నారు 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించాలని వ్యూహాలను రచించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే టిడిపి, జనసేన పార్టీల మధ్య పొత్తు అనివార్యం అయ్యింది. దీంతో ఈ టిక్కెట్టును పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయిస్తారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. ప్రస్తుతం జనసేన పార్టీ నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ స్థానికేతరుడు కావడంతో టిడిపి అధిష్టానం ఈ టిక్కెట్టును టిడిపికే ఉండేలా చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదే నియోజక వర్గం నుంచి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పోటీకి దిగుతారనే ప్రచారం లేకపోలేదు. అదేజరిగితే టిడిపి అధిష్టానానికి చేసేది ఏమీ ఉండదు. వర్మకు టిక్కెట్టు లభించే అవకాశాలు ఉండవు. దీంతో ఆయన పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? లేక గతంలో మాదిరిగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీలో నిలుస్తారా? అనే వేచిచూడాల్సిందే.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మిరియాల రాజు(45) రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో పారిశుధ్య విధులకు వెళ్తూ మరం సెంటర్లో మస్టర్ వేయించుకుని, 27వ వార్డులోని అమ్మాజమ్మ కాలనీలో పారిశుధ్య విధులు నిర్వర్తించేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లాడు. మెహర్ కాంప్లెక్స్ సమీపంలో తను వెళ్తున్న వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు బలమైన గాయం అయ్యింది. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు గత 15 సంవత్సరాలుగా సామర్లకోట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రాజు మృత దేహాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైసిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, అబ్బు, రేడ్నం దొరబాబు, కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్, తెదేపా నాయకులు బడుగు శ్రీకాంత్, బలుసు వాసు తదితరులు సందర్శించి మతుని కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేష్ తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని వేములవాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బుధవారం తెల్లవారుజామున ఇంటి సమీపంలో ఉన్న పశువుల మకాం వద్దకు వాసంశెట్టి సూరిబాబు(35)వెళ్లగా ఎడమ కాలుపై పాము కాటు వేసింది. దీంతో సూరిబాబు అపస్మారక స్థితికి చేరు కున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించే క్రమంలోనే పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసులో భర్తకు జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ

భార్యను వేధించిన కేసులో భర్తకు కాకినాడ 2వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి బుధవారం ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలావున్నాయి. 2011లో కాకినాడకు చెందిన సురభి విజయలక్ష్మి అనే పోతుకుచ్చి విజయలక్ష్మితో హైదరాబాద్కు చెందిన పోతుకుచ్చి హనుమ శ్రీనివాస్కు కాకినాడలో వివాహం జరిగింది. హైదరాబాద్లో భర్తతో కాపురం చేస్తున్న సమయంలో తన భర్త అదనపు కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధించాడు. ఈ మేరకు బాధితురాలు 2012లో కాకినాడ 2 టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్ఐ దుర్గారావు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై వాదప్రతివాదనలు విన్న న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

పోలీసుల అదుపులో బంగారు నగల దొంగ

ప్రజాశక్తి-మండపేట

ఈ నెల 6న ద్వారపూడి శ్రీవెంకట రమణ జ్యుయలర్స్ షాప్లో చోరీ కేసులో నిందితుని అదుపులో తీసుకుని అతని వద్దనుంచి రూ. 7,20,000 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి టిఎస్ఆర్కె ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఇప్పనపాడులోనిరూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన గొట్టపు లోకేష్ రాత్రి సమయంలో షాప్ గోడకు కన్నం పెట్టి సుమారు 304 గ్రాముల బంగారు వస్తువులు దొంగిలించాడు. ఉదయం షాపుకు వచ్చి చూసుకున్న యాజమని గాదంశెట్టి రామచంద్ర మూర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సిఐ కొమ్ముల శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. దొంగతనం ప్రాంతంలో టెక్నికల్ ఆధారాలతో నిందితుని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాహనం ఢీకొని ఎస్ఐకు గాయాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎస్ఐ తలకు గాయాలయ్యాయి. ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ ఎస్క్మిగా పనిచేస్తూ అమలాపురం బదిలీపై వెళ్లిన సిహెచ్.సుధాకర్ ఈ నెల 16న విధులు ముగించుకొని ఆత్రేయపురం వస్తున్నారు లొల్లలాకుల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయం అయ్యింది. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం బొల్లినేని హాస్పిటల్కు ఆయనను తరలించారు. ఆయన కుమారుడు ప్రనూత్ ఇచ్చిన ఫిర్యాది మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్క్మి బి.వి.కిరణ్కుమార్ తెలిపారు.

పేదలకు సేవలందించడమే ట్రస్ట్ లక్ష్యం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఆపదలో ఉన్న పేదలకు తగిన సేవలు అందించడమే లక్ష్యంగా తమ ఉప్పు సీతారామయ్య ట్రస్ట్ పనిచేస్తుందని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో 300 మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త ఉప్పు సత్యనారాయణ, ఉప్పు కోదండమ్, కుటుంబీకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -యంత్రాంగం

పెద్దాపురం స్థానిక లూథరన్ హైస్కూల్లో 1995-96 విద్యా సంవత్సరంలో 10తరగతి చదివిన విద్యార్థులు సంక్రాంతి పర్వదినాలలో తమ ఇక్కడు వచ్చిన సందర్భంలో బుధవారం తాము చదువుకున్న హైస్కూల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వీరందరూ ఆనాటి మధురస్మృతులను మననం చేసుకున్నారు. అనంతరం ఆనాడు తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్ది వీరవెంకట సత్య కుమార్, శివశక్తి లోవరాజు, బద్ది శ్రీదేవి, ఆకుల దశరథ రామయ్య, పిట్ట ఆనంద్, మాడెం నాగేశ్వరరావు, కోన వెంకట్రావు, కోలం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని మల్లేపల్లి హైస్కూల్లో 1998-2003 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు స్థానిక శుభప్రద్ ఫంక్షన్ హాలులో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులతోపాటు, నాటి ఉపాధ్యాయులు రాజశేఖర్రెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజు, గిరిధర్, రాంబాబు, అప్పన్న, మోహినీ, సాయి లక్ష్మిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల తరువాత ఆత్మీయ కలయిక అపూర్వంగా ఉందని అన్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యార్థులతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దార్లంక భద్రం, వంగలపూడి నాగేంద్ర, కోమరి ప్రసాద్, గొర్లె హేమంత్, కమటం శ్రీను, గొల్లపల్లి అర్జున్, వెలువరి నాగు, పూర్వపు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **కాజులూరు** మానవత్వమే సమాజ సంపద అని ఎస్డిఐఆర్ ఉన్నత పాఠశాల విశ్రాం త హెచ్ఎం. వీరభద్రరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోలంక ఎస్డిఐ ఆర్కె ఉన్నత పాఠశాలలో 1986 - 87 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మే ళనాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే పూర్వ విద్యా ర్థులు రాకతో పాఠశాలలో సందడి నెలకొంది. నాడు మాట్లాడు కున్న మాటలతో ఒకరినొకరు పిలుచుకుంటూ ఆనందాన్ని పొందారు. పలువురు ఉన్నత స్థానంలో ఉండడంతోపాటు పలువురు సాధారణ జీవితం గడుపుతున్నారు. ఒకరినొకరు పలకరించు కోవడంతో తెలియకుండా ఆనంద భాష్పాలు రాల్చారు. నాడు చదువు చెప్పిన ఉపా ధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సం దర్భంగా విశ్రాంత హెచ్ఎం వీరభద్ర రాజు మాట్లా డుతూ నాడు ఎందరో విద్యార్థులు పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థానానికి చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాం క్షించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలి యకతో వారి కుటుంబాల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. లక్షల ఆస్తి ఉన్నప్పటికీ విద్య లేక పోతే సమాజంలో ముందుకు సాగలే రన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం. ప్రసాద్, జె.వీర్రాజు, ఎస్.వేణుగోపాల్, పి. శ్రీనివాస్, టి.వై సూర్రాజు, కె.దుర్గారావు, సిహెచ్.సుబ్రహ్మణ్యేశ్వ రి, డి.అఖిల, డి.లలిత, రమణి పాల్గొన్నారు.



పెద్దాపురంలో గురువులతో పూర్వ విద్యార్థులు

గండేపల్లిలో పూర్వ విద్యార్థులు

కుల వివక్షకు బలైన రోహిత్ వేముల

ప్రజాశక్తి - కాకినాడ

రోహిత్ వేముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా నేటికి దేశంలో కులవివక్ష ఉందని, ఆ కుల వివ క్షకే రోహిత్ వేముల బలైపోయా డని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ఆధ్వ ర్యంలో బుధవారం సుందరయ్య భవనంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కుల వివక్షకు బలైపోయిన వేముల రోహిత్ 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ వేముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘం సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వ రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కెవిపిఎస్ సీనియర్ నాయకులు కె.కృష్ణమూర్తి, పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ శక్తుల దుర్మార్గానికి రోహిత్ వేముల మృతి చెందాడని, మరణాంతరం వీరి దుశ్చర్యలను ఖండిస్తూ దేశమంతటా పోరాట జ్వాలలు సంతరించుకుని వేముల రోహిత్ మృతి చట్ట రూపకల్పనకు దారి తీసిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థపై దాడి జరుగుతుందని ఈ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్కుమార్, కె.సింహాచలం, ప్రజా సంఘాల నాయకులు పలివెల వీరబాబు, ప్రభాకర్ వర్మ, జ్యోతి, మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి 22 వరకు గంధోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

గంధోత్సవం జరిగే దర్గా

భి న్నత్వం లో ఏకత్వానికి పేరుపొందిన పాత పెద్దాపురంలోని హజ రత్ షేక్ మదీనా పాచ్చా, షార హమత్ తుల్లా ఔలియా వార్ల గందోత్సవం ఈనెల 20 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ లాయక్ ఆలీ తెలిపారు. 9 మూరల సాహెబ్గా హిందు వులు, నాగస్ వలీ బాబాగా ముస్లింలు పిలుచుకునే ఈ గందోత్సవానికి జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి వస్తారని చెప్పారు. 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు అంజుమన్ వ్యవ స్థాపకుడు ఎంఎ సత్తార్ ఇంటి వద్ద నుంచి ఈ గందం ఊరేగింపు ప్రారంభమై మేళ తాళాలతో పురవీధుల మీదుగా దర్గాకు చేరుకుంటుందన్నారు. ఈ ఉత్సవంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి నియోజకవర్గ ఇన్ఛార్జ్ దవులూరి దొరబాబు, జనసేన ఇన్ఛార్జ్ తుమ్మల బాబు, గోలి రామారావు, మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, లలితా ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జనాబ్ బషీరుద్దీన్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ కరీం జానీ, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు పాల్గొంటారన్నారు.

ఆరోగ్యంతోపాటు ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

క్రీడాకారులతో దవులూరి సుబ్బారావు

క్రీడా పోటీల్లో పాల్గొ నడంతో విద్యార్థులకు, యువ తకు ఆరోగ్యంతోపాటు క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని వైసిపి రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షులు దవులూరి సుబ్బారావు అన్నారు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకూ కర్నూలు జిల్లా నంద్యా లలో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లు ఎంపిక కార్యక్రమం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్లో బుధ వారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంతోపాటు ఉద్యోగాలు పొందుటకు అవకాశం ఉందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, కమిటీ జిల్లా నాయకుడు వూబా జాన్ కెనడి, పాలిక చంటిబాబు, సల్లూరి కళ్యాణ్, రిటైర్ పిఇటి టిఎండివి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న చిక్కాల రామచంద్రరావు

మండపేటలో ఈ నెల 20న జరిగే రా.. కదలిరా సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి చిక్కాల రామచం ద్రరావు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం మండల టిడిపి అధ్యక్షుడు టేకుమూడి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న రా కదిలిరా సభకు పెద్దఎత్తున టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జ్ దాట్ల సుబ్బరాజు, జనసేన పార్టీ ఇన్ఛార్జ్ పితాని బాలకష్ణ పాల్గొని మాట్లాడారు. ఈ కార ్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణబాబి, పెసింగి ఈశ్వరరావు, ముత్యాల జయశ్రీ, కట్టా త్రిమూర్తులు, అత్తిలి బాబూరావు, కొమ్మోజు సుబ్రహ్మణ్యం, మోపూరి వెంకటేశ్వర, తదితరులు పాల్గొన్నారు.

ఐదు తరాల కుటుంబ సభ్యుల కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరు గ్రామంలోని వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కంటే వీరరాఘవరావు కుటుంబానికి చెందిన 5 తరాలకు సంబంధించిన 350 మంది బుధవారం వడ్లమూరులో ఒకేచోట సమావేశమై బంధుత్వంలోని ఆత్మీయ ఆనందాలను పంచుకున్నారు. ముత్తాతలు, తాతలు, అవ్వలు, అమ్మమ్మలు, మనుమలు, మునిమనుమలు, కుటుంబ వ్యవస్థలో పిలుచుకునే అన్ని వరుసల వారితో ఆ సమావేశం ఆనందంతో డోల లాడింది. ఈ కార్యక్రమంలో కంటే నారాయణ, సుబ్బరాజు, పెద్ద రాఘవ, నాగేశ్వరరావు, అన్నవరం, రామకృష్ణ, వీర రాఘవరావు, కృష్ణార్జునరావు, ధనం, సంతోష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రతిపాడు కోర్టుకు చెందిన న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి అల్లూరి సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ పేద, చిన్నా, సన్నకారు రైతులకు, ప్రజలకు ఇబ్బందికరంగా పరిణమించే ఈ చట్టాన్ని వెంటనే రద్దు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కార్యదర్శి బొంగుకూరి మధుబాబు, న్యాయవాదులు సిహెచ్.రామకృష్ణ, రాజాల చిట్టిబాబు, పిల్లి బలరాముడు ఆకుల హరిబాబు, ఆర్ వెంకటరావు, ఆడారి సుగుణ, పలివెల నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - కరప

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యాలయ సూపరింటెండెంట్ భీమశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, ఫ్రంట్ లైన్ వర్కర్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భ:గా ఇఒపిఆర్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ15వ ఆర్థిక సంఘ నిధులను శానిటేషన్, సురక్షిత మంచినీరు కొరకు సాధారణ నిధులు కలుకుని 25 శాతం ఖర్చు చేయాలని తెలిపారు. మిగిలిన నిధులను ఇతర అంశాలకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు సాయం అందించాలి

ప్రజాశక్తి - గోపాలపురం



సాయం అందిస్తున్న కృష్ణ, కుటుంబ సభ్యులు

అనాథలకు, అభాగ్యుల పట్ల మానవత దృక్పథంతో తగిన సాయం అందించాలని మెహర్ శ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సుగ్గనబోయిన కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని గుడ్డిగూడెంలో వృద్ధాశ్రమానికి సుగ్గనపోయిన కృష్ణ, మెహర్ జ్యోతి దంపతులు వారి కుమార్తె లిఖిత సాయి రూ.5వేల విరాళం అందించారు. ఇళ్ల లక్ష్మన్న, వీరాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం అందించామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాథలు, కుటుంబ సభ్యుల ఆసరాను కోల్పోయిన వృద్ధులకు అనాధ శరణాలయాలు ఎంతో అండగా ఉంటున్నాయన్నారు. వాటి నిర్వహణకు దాతలు సాయం అందించాలన్నారు.

నేడు మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

రామచంద్రపురం : రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మండల కార్యాలయంలో ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ కీర్తి స్పందన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ బడ్జెట్ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - యంత్రాంగం

పలుచోట్ల పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనాలను నిర్వహించుకున్నారు. **గోపాలపురం** మండలం వాదాలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరం పదోతరగది విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.భాస్కరరావు, ఎస్ఎస్ఎస్.సత్యనారాయణ, పి.భాస్కర్, ఎం.శ్రీనివాస్, ఆర్.రాంబాబు, పి.నాగరాజు, పి.విజయ్, ఎల్.బుజ్జిబాబు పాల్గొన్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు దివంగత సత్యనారాయణకు నివాళు లర్పించారు. **ఉండ్రాజవరం** మండలం సూర్యారావుపాలెంలో బుధవారం 1993-94 ఏడవ తరగతి విద్యార్థుల కలయిక జరిగింది. నాటి విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 120 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు ఎవి.రమణారావు, నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, అయినపర్తి రాజగోపాల్, రాపాక ఏసుబాబు తదితరులను సన్మానించారు. మాజీ సర్పంచ్ వల్లేపల్లి వెంకట సుబ్బారావు, ప్రస్తుత సర్పంచ్ మెండే లలిత కుమారి, ఉప సర్పంచ్ నందిన శ్రీనివాస్, మెండే శ్రీనివాస్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. **చాగల్లు** మండలం ఉన్నగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరం పదోతరగతి విద్యార్థుల సమ్మేళనం అదే స్కూల్లో బుధవారం జరిగింది. నాటి గురువులను ఆచార్య రాజ్యలక్ష్మి గోపాలకష్ణంరాజు తదితరులు సన్మానించారు. ఆత్మీయ సమయం విజయవంతం కావడానికి ఆర్ఎల్ శ్రీనివాసరావు, కె.లక్ష్మీనారాయణ కృషి చేశారు. పాఠశాల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసురావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు

ఇవిఎంలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - కరప

మండలంలో 66 పోలింగ్ బూత్ల పరిధిలో ఇవిఎం మిషన్లపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తాహశీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం అరట్లకట్ట గ్రామంలో ఈ సందర్భంగా ఇవిఎంలపై ప్రజలకు అవగాహన కల్పించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ యంత్రాల్లో ఓటు వేసేందుకు ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇవిఎం యంత్రాలు ఉపయోగించి ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని. వచ్చే నెల 9వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సులో ఆర్ఐ మాచరరావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కరాటం భాస్కరరావుకు మాతృవియోగం

అమలాపురం రూరల్: రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కరరావు మాతృమూర్తి సత్యవతి కోటమ్మ (80) బుధవారం మరణించారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు. సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్, సమనస సర్పంచ్ పరమట శ్యాంకుమార్, నిమ్మకాయల రాంబాబు, కరాటం సురేష్, నాని, రాజులపూడి భీముడు, ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.మనోహర్, కరాటం వెంకటేశ్వరరావు, బంధువులు నివాళులు అర్పించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

మామిడికుదురు : బడుగువారి పేటలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు జనసేన పార్టీ నాయకులు బుధవారం బియ్యం, కాయగూరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోతు కాశీ, మద్దింశెట్టి బుజ్జి, ఉప సర్పంచ్ గనసాల దీపిక, ఉర్రింక పొట్టయ్య, గ్రామశాఖ అధ్యక్షులు కండెల వెంకటేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు మామిడి రాజేష్, కుంపట్ల నాని, యాండ శ్రీను, జున్నూరి బ్రదర్స్ పాల్గొన్నారు.

పాస్పోర్టు పోయినది

కొవ్వూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మాలపాటి నారాయణరెడ్డి గారి కుమారుడు అయిన మాలపాటి రామకృష్ణరెడ్డి అను నాకు భారత ప్రభుత్వ పాస్పోర్టు కార్యాలయం వారు **పి.3412945** నంబర్తో పాస్పోర్టు ఇచ్చినారు. సదరు ఒరిజినల్ పాస్పోర్టు ది. 13-01-2024వ తేదీన నేను నా యింటి వద్ద నుండి కొవ్వూరు బస్ స్టాండ్కు వెళ్లుచుండగా నా ఫ్యాంట్ జేబులో నుండి మార్గ మధ్యలో పడిపోయినది. ఈ పాస్పోర్టు దొరికినవారు క్రింద తెలిపిన అడ్రస్కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

మాలపాటి రామకృష్ణరెడ్డి
S/o. నారాయణరెడ్డి
ఫ్లాట్ నెం. 181, ఇందిరమ్మ కాలనీ
కొవ్వూరు, సెల్: 9391064388

యానాం వార్తలు

వేతన ఒప్పందంపై చర్చలు విఫలం

లేబర్ అధికారితో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - యానాం

యానాం రైస్ మిల్స్ కార్మికులకు సంబంధించి నూతన వేతన ఒప్పందంపై స్థానిక లేబర్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మరోసారి చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల తరఫున సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, రైస్మిల్స్ యాజమాన్యం తరపున చిన్నబ్బాయి, గాయత్రి రైస్ మిల్ గుమస్తా రాంబాబు చర్చల్లో పాల్గొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లపై రైస్ మిల్స్ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. వారం రోజుల్లో నూతన వేతన ఒప్పందంపై ఒక నిర్ణయానికి రాకపోతే సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అసిస్టెంట్ లేబర్ ఇన్స్పెక్టర్ దయానిధి ఇరువురు మరోసారి చర్చలకు రావాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ కే.సత్యనారాయణ, వి.వెంకటేశ్వరరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సలాది నాగబాబు, దాసరి రాజు, సబ్బతి రాంబాబు, కుప్పిశెట్టి నాగేశ్వరరావు, సూరిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

15వ రోజుకు అవుట్సోర్సింగ్ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - యానాం

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని యానాం ప్రభుత్వాసుపత్రి ఎదుట అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన బుధవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ రోజుల్లో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో కుటుంబాలతో ఆనందంగా సంతోషంగా గడుపుతున్నారని, కానీ తాము మాత్రం కుటుంబాన్ని కాదని రోడ్లపై బైఠాయించి నిరసనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాల సైతం లెక్కచేయకుండా సేవలందించామని, కానీ తమ వేతనాలపై ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. సిబ్బందికి పలువురు సంఘీభావం తెలిపారు.

జూదాల నిర్వహణపై పలువురిపై కేసులు

ప్రజాశక్తి - కాకినాడ

సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న ప్రదేశాలపై పోలీసు ప్రత్యేక బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహించిన కేసులు నమోదు చేసినట్లు ఎస్పి సతీష్కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దాడుల్లో 685 మందిని అరెస్టు చేసి వారి నుంచి 345 పందెంకోళ్ళు, 369 కోడి కత్తులు, రూ.3.25 లక్షలు జూదానికి పెట్టిన నగదుతో పాటు గుండాట జూదాలకు వాడిన బోర్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్వాహకులపై 289 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

19న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను సరిచేసేందుకు మరమ్మతులు చేయనున్నామని, ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఈ నెల 19న విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆర్యవటం సబ్ స్టేషన్లో విలేకరులతో ప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ 33/11 కెవి గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి ఫీడర్స్కు సంబంధించిన ప్రాంతాలైన ఆర్యవటం, గొల్లపాలెం, బందనపూడి, మొగలిపాలెం, శలపాక, తనుకువాడ, శీల, ఒంటితాడి, మంజేరు, టి.మామిడాడ, గొర్రి పూడి, పెనుమల్ల, అంద్రంగి, తనుమల్ల, పెడపాటి గరువు, పెద్దాపురప్పాడు, యండమూరు, విజయరాయుడుపాలెం, జగన్నాథగిరి గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారులకు, ఆక్వా మరియు ఇండస్ట్రీయల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

పలువురికి జ్యోతుల నవీన్ పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న జ్యోతుల నవీన్

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామంలో టిడిపి యువ నాయకుడు సుబ్రహ్మణ్యం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలు కావడంతో సుబ్రహ్మణ్యాన్ని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరామర్శించి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు అదే విధంగా సూరంపాలెం గ్రామానికి చెందిన కుంచె వీరభద్రరావు ఇటీవలే మరణించడంతో బుధవారం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ వీరభద్ర రావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పర్యటనలో కుంచె నాగబాబు, కుంచే రామకృష్ణ, సూరంపాలెం బాలు, కుంచే గంగాధర్, బేతాళం పాపారావు, పోసిన బాబురావు, అనంత భీమేశ్వరరావు, కుంచే లక్షణాస్వామి, కుంచే విష్ణుమూర్తి, తాటికొండ నాని తదితరులు పాల్గొన్నారు

మహారాజశ్రీ ఫ్యామిలీ కోర్టు మరియు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

A.R.B.E.P. No. 166/2021
in A.R.C. No. 192/2014

Between:
Shriram City Union Finance Ltd., Rajahmundry-II Branch, Rep. by its Regional Manager cum GPA Holder Mr. D.Ram Mohan, S/o. Lakshminarayana, Hindu, aged 51 years, Rajahmundry Zone.
...Claimant/ D.H.R.
AND
Akula Srinu & Others
...Respondents/ JDR's
1. A.Srinu, S/o. A.Venkat Rao, R/o. H.No. 30-1-17, J.P.Road, Rajahmundry, E.G.District - 533101.
2. A.Kavitha, W/o. A.Srinu, R/o. H.No. 30-1-17, J.P.Road, Rajahmundry, E.G.District - 533101.
...1st, 2nd Respondents/ J.D.R's

పై నెంబరు గ్రంథములో మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **25-1-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథములో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు గ్రంథము మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 18-1-2024
ఎం.సూర్యమోహనరావు
అడ్వకేట్, రాజమండ్రి